## క్లుప్తంగా

### చిక్కేపల్లిలో ఇసుక డంపులు సీజ్



పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను శనివారం సీజ్ చేసినట్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొందరి వ్యక్తులు ఏలాంటి అనుమతులు లేకుండా ఇసుక డంపులు ఏర్పాటు చేసినట్లు సమాచారం రావడంతో హెచ్‌సీ చంద్రశేఖర్, ఆర్‌ఐ తిరుపతయ్య వెళ్లి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎనిమిది ఇసుక డంపులను గుర్తించి వాటిని సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేసే వారిపై చర్యలు తప్పవన్నారు.

### వేసవి శిక్షణను వినియోగించుకోవాలి



వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని 'బాల భవన్'లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బాలభవన్ సూపరింటెండెంట్ లావణ్య తెలిపారు. ఈ క్యాంపులో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు, 6వ తరగతి వరకు 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 10.30గంటల నుంచి 12గంటల వరకు డ్యాన్స్, డ్రాయింగ్, టైలరింగ్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సహకరిస్తే మరెన్నో కార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

### బీజేపీ మండలాధ్యక్షుడిగా నర్సింహ



కొత్తకోట రూరల్: కొత్తకోట మండల బీజేపీ అధ్యక్షుడిగా పాలెం గ్రామానికి చెందిన చీర్ల నర్సింహ్మ నియమితులయ్యారు. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎంపీ డీకే.అరుణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిలు ప్రకటించగా ఈ మేరకు నియామక పత్రాన్ని అందుకున్నారు. శనివారం బీజేపీ మండలా ధ్యక్షుడు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

పాన్‌గల్: బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. వీపనగండ్ల మండలం వల్లభాపూర్ తండాకు చెందిన రాందాస్ అతని భార్య మంగమ్మ ఇద్దరు కలిసి ఈనెల 16న బైక్‌పై వనపర్తి నుంచి తండాకు బయలుదేరారు. పాన్‌గల్ పాల్కి చెరువు కట్ట సమీపంలోకి రాగానే పాన్‌గల్ నుంచి వనపర్తి వెళ్తున్న ఆటో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో రాందాస్, మంగమ్మకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ యాదిపై రాందాస్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

**వాహన అద్దాలు ధ్వంసంపై..**

పాన్‌గల్: ఆర్‌సీఎం వాహనం అద్దాలు ధ్వంసం చేయడంతో దూషించిన వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని దొండాయిపల్లి గ్రామానికి చెందిన కొమ్ముల శంకర్ పాన్‌గల్‌లోని ధనంజయ్ క్రషర్ కంపెనీలో ఆర్‌సీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 16న మండలంలోని శాగాపూర్ గ్రామ శివారులో జరుగుతున్న సీసీ రోడ్డు పనుల కోసం వాహనంలో కాంక్రీటు తీసుకెళ్లాడు. అయితే గ్రామానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి రోడ్డు పనులను అడ్డుకొని పనిచేస్తున్న వారితో వాగ్వాదానికి దిగాడు. అంతేకాకుండా వాహనం అద్దాలు ధ్వంసం చేశాడు. దీంతో డ్రైవర్ శంకర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

**దాడి ఘటనపై..**

పాన్‌గల్: భార్యతో పాటు అత్తమామలపై దాడి చేసిన ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ యాదగిరి తెలిపారు. మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన రాత్లావత్ జాన్సీకి నాగర్ కర్నూల్ జిల్లా కోడేర్ మండలం, నాగులపల్లి తండాకు చెందిన రాత్లావత్ రవితో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు సంతానం. అయితే రవి మద్యానికి బానిసై భార్యను తరచూ హింసించేవాడు. ఇంటిపై రుణం తీసుకున్న విషయంలో భార్యాభర్తల మధ్య ఈనెల 16న గొడవ జరిగింది. ఈ క్రమంలో తెల్లరాళ్లపల్లితండాకు వచ్చిన రవి తన భార్య అలాగే అత్తమామలపై కట్టెతో దాడి చేసి గాయపర్చాడు. దీంతో జాన్సీ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా రవిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెల్లడించారు.

# ప్రకృతి వనాలపై పట్టింపేది?

- నిర్వహణ లేక నీరుగారుతున్న లక్ష్యం
- పట్టించుకోని కార్యదర్శులు
- ఎండుతున్న మొక్కలు





వడ్డేవాట పల్లె ప్రకృతి వనంలో విరిగిపోయిన గేటు

కొత్తకోట రూరల్: ఔషధ, పూల మొక్కలతో కళకళలాడాల్సిన పల్లె ప్రకృతి వనాలు నేడు కళ తప్పుతున్నాయి. గ్రామ పంచాయితీ అధికారుల నిర్లక్ష్యంతో అధ్వాన్న స్థితిలో నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాలు పచ్చదనంతో వికసించాలనుకున్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. మొక్కలు ఎండుతున్నా,నిర్మాణాలు కూలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మండల పరిధిలో..**

కొత్తకోట మండలంలోని 22 గ్రామాల్లో గ్రామానికి ఒకటి చొప్పున 22 పల్లె ప్రకృతి వనాలను మూడేళ్ల క్రితం ప్రభుత్వ ఏర్పాటు చేసింది. ఇందు కోసం రెవెన్యూ అధికారులు హుటాహుటిన స్థలాలను సైతం కేటాయించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం పంచాయితీ అధికారులు, అప్పటి సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పల్లె ప్రకతి వనాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రకృతి వనాల్లో వాకింగ్ ట్రాక్, నేతల విగ్రహాలు, జాతీయ జెండాతో పాటు వివిధ రకాల ఔషధ, పూల మొక్కలు నాటారు. సర్పంచ్‌ల పర్యవేక్షణలో ప్రకృతి వనాల నిర్వహణ బాగానే ఉన్నా, ప్రస్తుతం వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కూలుతున్న నిర్మాణాలు..**

పల్లె ప్రకతి వనాల్లో ఏర్పాటు చేసిన నిర్మాణాలు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. చెత్తా చెదారంత పేరుకు పోవడంతో ప్రకృతి వనాల్లో పాములు, ఇతర విష పురుగులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో పాటు మందుబాబులు కూడా పల్లె ప్రకతి వనాలను అడ్డాగా మార్చుకుంటున్నారు. వేసవిలో మొక్కలకు నీరందక ఎండుముఖం పడుతున్నాయి. ఇంతా జరుగుతున్నా పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. తక్షణమే పల్లె ప్రకృతి వనాలను బాగు చేయించి పూర్వ వైభవం తీసుకువచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నాచారంపేట శివారులో గుట్టపై ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో ఎండిన మొక్కలు



వడ్డేవాట పల్లె ప్రకృతి వనంలో ఇలా..

**కళ తప్పాయి**



గతంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ ఉండటంతో పల్లె ప్రకృతి వనాలు కళకళలాడుతుండేవి. ప్రస్తుతం పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కళతప్పాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలను కాపాడాలి.

– భీమన్ననాయుడు, కానాయపల్లి

**గతంలో మేమే చూసుకునేవాళ్లం**



సర్పంచ్‌ల పర్యవేక్షణలో పల్లెప్రకృతి వనాల కళకళలాడాయి. మొక్కలు ఎండకుండా కూలీలను పెట్టి రెండు పూటల నీళ్లు పట్టేవాళ్లం. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో పాటు ప్రభుత్వం మారడంతో పల్లెప్రకృతి వనాల పర్యవేక్షణ పూర్తిగా గాలికొదిలేశారు.

–హిమబిందు, మాజీ సర్పంచ్, అప్పరాల

**పూర్తి బాధ్యత కార్యదర్శులదే**



పల్లె ప్రకృతి వనాల బాధ్యత రెండేళ్ల వరకు డీఆర్‌డీఏ చూసుకుంది. రెండేళ్లు పూర్తయిన వెంటనే గ్రామ పంచాయతీలకు అప్పగించాం. ప్రతి శుక్రవారం చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమం నిర్వహిస్తున్నాం. నీటి కొరత కారణంగా మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి.

– శ్రీనివాసులు, ఎంపీడీఓ, కొత్తకోట

## జిల్లా పోలీసుశాఖను అగ్రస్థానంలో నిలపాలి



డీఎస్పీ కార్యాలయ పునః ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు

వనపర్తి: శాంతిభద్రతలు, ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు పోలీస్‌శాఖకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వద్ద పునర్నిర్మించిన డీఎస్పీ కార్యాలయాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు రక్షణ కల్పించే పోలీసు కార్యాలయాలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో డీఎస్పీ కార్యాలయాన్ని పునః ప్రారంభించినట్లు చెప్పారు. ఇందుకు నిధులు మంజూరు చేసిన కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఠాణాల్లో మౌలిక వసతుల కల్పనకు సొంత నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన మూడు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఒక్కో భవనానికి రూ.32 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఆయా మండలాల్లో స్టేషన్ హౌస్ ఆఫీస్‌లు సైతం నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణంలో సర్కిల్ కార్యాలయం, మరో ఎస్‌హెచ్‌ఓ కార్యాలయం మంజూరుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. డీఎస్పీ కార్యాలయం పట్టణంలో ప్రజలకు అందుబాటులో ఉంటే బాగుంటుందని, ఎస్పీ, డీఎస్పీ చొరవ చూపడంతో నిధులు మంజూరు చేశామని చెప్పారు. అలాగే ప్రభుత్వం నుంచి అద్దె చెల్లించే బాధ కూడా తప్పిందన్నారు. అదేవిధంగా పోలీస్‌శాఖకు అవసరమైన ఇతర మౌలిక వసతుల కల్పనకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ.. పోలీస్‌శాఖ జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని అన్నారు. ఇక ముందు కూడా ఇదే స్ఫూర్తితో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకొస్తామని తెలిపారు. పోలీస్‌శాఖకు అండగా నిలుస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ కలిసి డీఎస్పీ వెంకటేశ్వరరావును గౌరవప్రదంగా కుర్చీలో కూర్చోబెట్టారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, సీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

పాన్‌గల్: చిన్నారులకు, గర్భిణులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. శనివారం మండలంలోని బహుదూర్‌గూడెంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పౌష్టికాహారం తదితర అంశాలపై గర్భిణులు, చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఏ వ్యాక్సిన్‌తో ఏ రోగం తగ్గుతుందో తెలుసుకోవడానికి మాతా శిశు సంరక్షణ కార్డు( ఎంసీహెచ్) వ్యాక్సినేషన్ పుస్తకం చదివితే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రమాదేవి, శైలాజ, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని ఇందిరా కాలనీకి చెందిన గంధం చిలకమ్మ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శ్రీను, గోర్ల అనిల్, గంధం బాలు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి అందజేసిన రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

### ఘనంగా షేక్షావలి ఉర్సు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఖిల్లా గట్టు పక్కన ఉన్న గుట్టపై ఉన్న షేక్షావలి దర్గా ఉర్సు శనివారం ఘనంగా నిర్వహించారు. మొల్ల మునిరొద్దీన్ ఇంటి నుంచి గుట్టపైన ఉన్న దర్గా వరకు గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. దర్గాను పూలతో అలంకరించడం, గంధం చల్లడం, చాదర్ వేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మహ్మద్‌సాదిక్, సయ్యద్ ఖాదర్, మైనొద్దీన్, ఇంతియాజ్, ముజాయిద్, అజీం తదితరులు పాల్గొన్నారు.

### అకాల వర్షం.. రహదారులు జలమయం



రహదారిపై పారుతున్న నీరు

అమరచింత: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావారణం చల్లబడింది. మురుగు కాల్వలతో పాటు రహదారులపై ఉన్న గుంతలు సైతం వర్షపు నీటితో నిండుగా కనిపించాయి.

### రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా వాసి

వనపర్తిటౌన్: హైదరాబాద్‌లోని షామీర్‌పేట్‌లో శనివారం జరిగిన తెలంగాణ మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం ఉత్సవం, దశమ వార్షికోత్సవ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన పోతులపల్లి శివకుమార్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. మీ సేవ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచిన రాష్ట్ర అధ్యక్షుడు, కార్యవర్గం, మీసేవ మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

### బాల్య వివాహాలను నిర్మూలించాలి

మానవపాడు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బాలల సంరక్షణ జిల్లా లీగల్ అధికారి ఎత్తం శివ అన్నారు. మండలంలోని అమరవాయిలో శనివారం ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నత విద్య అందించాలన్నారు. రుకుమొద్దీన్, శిరీష, వేణు, విజయ్, నిర్మల పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు, తరలింపులో జాప్యం వద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాజవర్ధన్‌రెడ్డి

గోపాల్‌పేట: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చే వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడంతో పాటు మిల్లులకు తరలించాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని బుద్దారం, పొలికెపాడు, గోపాల్‌పేట, ఏదుట్ల, చెన్నారంలోని వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లు, మిల్లులకు ధాన్యం తరలింపు వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టరులో నమోదు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత మిల్లులకు తరలించడంలో జాప్యం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రైతులు నిబంధనల ప్రకారం తాలు, గడ్డి లేకుండా ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట స్థానిక రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

**రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు**

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని మండల వ్యవసాయాధికారి (ఏఓ) రాజవర్ధన్‌రెడ్డి కేంద్రాల ఇన్‌చార్జిలకు సూచించారు. శనివారం మండలంలోని రేమద్దుల గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం సేకరణ, సేకరించిన ధాన్యం తరలింపుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం వివరాలను రికార్డులో నమోదు చేసి తేమ శాతం వివరాలను రైతులకు వివరించాలన్నారు. నిబంధనల మేరకు ధాన్యం సేకరించాలని నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ బకాయిలు చెల్లించండి



ఏపీఓకు వినతిపత్రం అందజేస్తున్న కూలీలు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్ళపల్లిలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పనుల పరిశీలనకు వచ్చిన ఏపీఓ కుర్మయ్యకు వినతి పత్రం అందజేశారు. ఐదు వారాల కూలీ డబ్బులు విడుదల చేయకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో కూలీ డబ్బులు ఎప్పటికప్పుడు చెల్లించేవారని ప్రస్తుతం రెగ్యూలర్‌గా అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కూలీల కూలి డబ్బులు త్వరగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సాయిలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న బాల్‌రెడ్డి

వనపర్తి రూరల్: తాలు, తరుగు పేరుతో రైస్ మిల్లర్లు విచ్చలవిడిగా రైతులను దోచుకుంటున్నారని, వారి దోపిడీని అరికట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైతు సంఘం (ఏఎస్‌కే) ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పెద్దగుడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైస్ మిల్లర్లు తరుగు పేరిట క్వింటాల్‌కు మూడు కేజీల ధాన్యాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. నెల రోజులు గడుస్తున్నా కేంద్రాల్లో ఆరబెట్టిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీల కొరత కారణంగా 2,600 బస్తాల ధాన్యం మిల్లులకు తరలించకుండా కేంద్రం వద్దే నిల్వ చేశారన్నారు. అధికారులు స్పందించి లారీల కొరత లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి నిక్సన్, దేవేందర్‌యాదవ్, శివయ్య, లక్ష్మి, అలివేలు, రాముడు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## తుదిదశకు ఎంపీడీఓ కార్యాలయ పనులు



నిర్మాణం పూర్తి కావస్తున్న ఎంపీడీఓ కార్యాలయం

అమరచింత: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ పనులు తుది దశకు చేరుకున్నట్లు ఎంపీడీఓ నర్సింహులు తెలిపారు. మండలం ఏర్పాటైనప్పటి నుంచి ఎంపీడీఓ కార్యాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల స్థానిక ఉర్దూ మీడియం పాఠశాలలో కొన్ని గదులను వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం ఇవ్వడంతో కార్యాలయానికి తగినట్లుగా పనులు చేపట్టారు. ఈ పనులు తుదిదశకు చేరుకున్నాయని త్వరలోనే ఎమ్మెల్యే చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.


## 'జూరాల' మెట్ల మార్గాన్ని బాగు చేయండి



ధ్వంసమైన జూరాల మెట్లమార్గం

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ భాగంలో నది దిగువ భాగానికి వెళ్లేందుకు నిర్మించిన మెట్ల దారి ఇటీవల ధ్వంసమైంది. ప్రాజెక్టు పైభాగం నుంచి వచ్చే కృష్ణా నది పరవళ్లను నేరుగా చూసేందుకు పర్యాటకులకు ఈ మెట్ల మార్గం వీలుగా ఉండేది. అయితే ప్రస్తుతం మెట్ల మార్గం శిథిలం కావడంతో మరమ్మతులు చేసేవారే కరువయ్యారు. వచ్చే నెల నుంచి జూరాలకు వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉండడంతో కృష్ణా నది అందాలను తిలకించేందుకు పర్యాటకులు వస్తుంటారు. అధికారులు స్పందించి మెట్లను బాగు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## 'ఉపాధి' పనులు పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న డీఆర్డీఓ నర్సింహులు

అడ్డాకుల: గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పనులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఆర్డీఓ నర్సిములు అన్నారు. మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం జరిగిన 4వ విడత సమాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31 వరకు మండల వ్యాప్తంగా ఎన్ఆర్‌ఈజీఎస్‌లో రూ.3.33కోట్లు, పీఆర్‌లో రూ.1.41కోట్ల పనులు జరిగాయి. వాటిపై ఇటీవల తనిఖీ బృందం గ్రామాల్లో విచారణ చేపట్టి నివేదిక రూపొందించారు. ఏపీడీ ముసాయిదాబేగం, ఫైనాన్స్ మేనేజర్ ప్రేమలత, అంబుడ్స్‌మెన్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజావేదికకు డీఆర్‌డీఓ నర్సింహులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొక్కల పెంపకంలోనే ఎక్కువగా అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందం గుర్తించింది. తక్కువ సంఖ్యలో మొక్కలు నాటి, ఎక్కువ రికార్డు చేయించడం, వాటర్ ట్యాంకర్ పేమెంట్ చేసినా చాలా చోట్ల మొక్కలు ఎక్కువగా ఎండిపోవడం నివేదికలో వెల్లడైంది. దీంట్లో చక్రాపూర్, నందిపేట, దాసర్‌పల్లి, స్ఫూర్తితండా, కొమిరెడ్డిపల్లి గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సిఫారసు చేసినట్లు ఎస్ఆర్‌పీ కె.స్వామి తెలిపారు. తనిఖీ బృందాలు గుర్తించిన దాంట్లో మండల వ్యాప్తంగా సుమారు రూ.54లక్షల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించగా ప్రజావేదికలో మాత్రం అధికారులు రూ.వేలల్లోనే ఉందని లెక్క తేల్చడం గమనార్హం. మండలంలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులను సరిగ్గా పర్యవేక్షించలేదని విచారణ సందర్భంగా పలుమార్లు ఎంపీడీఓ కృష్ణయ్యను డీఆర్‌డీఓ మందలించారు.

**రైతులకు మేలు జరిగే వాటికి ప్రాధాన్యం**

ఉపాధిహామీలో రైతులకు మేలు జరిగే పనులకే ఎక్కువగా ప్రధాన్యం ఇవ్వాలని డీఆర్డీఓ నర్సింహులు అన్నారు. ప్రజావేదిక పూర్తయిన తర్వాత ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే పనులతో పాటు ఫీడర్ ఛానల్, చెక్‌డ్యాం వంటి పనులను చేయించేలా చూడాలని చెప్పారు. ఉపాధి పనును ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, ఏపీఓలు గ్రామాల్లో జరిగే పనులను పర్యవేక్షిస్తే అవకతవకలకు ఆస్కారం ఉండదని చెప్పారు. పారదర్శకంగా పనులు జరిగేలా ఉపాధిహామీ సిబ్బంది పని చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ అనురాధ, పులేందర్, కె.స్వామి, డీఆర్‌పీలు సతీష్, పావని తదితరులు పాల్గొన్నారు.